# ‘బండి’నే బాద్‌షా

2.25 లక్షల ఓట్ల మెజారిటీతో కరీంనగర్ ఎంపీగా సంజయ్ గెలుపు

- ప్రతీ రౌండ్‌లో సంపూర్ణ ఆధిపత్యం
- బద్దలైన కేసీఆర్, వినోద్‌కుమార్ రికార్డులు
- హుస్నాబాద్‌లో కాంగ్రెస్ ఓట్లు పదిలం
- సిరిసిల్లలో రెండోస్థానంలో బీఆర్‌ఎస్
- మిగిలిన ఐదు స్థానాల్లో కమల వికాసం
- కరీంనగర్‌లో రెండోసారి కాషాయ రెపరెపలు
- రెండోస్థానంలో నిలిచిన వెలిచాల రాజేందర్‌రావు
- మూడోస్థానానికి పరిమితమైన వినోద్‌కుమార్


విజయ సంకేతం చూపిస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్ మరోసారి సత్తా చాటారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో ఆయన రెండోసారి విజయం సాధించారు. 5,85,116 ఓట్లు సాధించి, తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు (3,59,907 ఓట్లు)పై 2,25,209 ఓట్ల మెజారిటీతో రికార్డు విజయాన్ని అందుకున్నారు. కరీంనగర్ పార్లమెంట్ చరిత్రలో ఇది సరికొత్త రికార్డు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ 2,82,163 ఓట్లతో మూడోస్థానానికి పరిమితమయ్యారు. మాజీ సీఎం కేసీఆర్ 2006లో కరీంనగర్ ఎంపీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో 2.01 లక్షల ఓట్లు, 2014లో బీఆర్‌ఎస్ ఎంపీ బి.వినోద్‌కుమార్ 2.05 లక్షల ఓట్లే ఇప్పటివరకు అత్యధిక మెజారిటీలుగా కొనసాగున్నాయి. తాజాగా వెలువడిన ఫలితాల్లో 2.25 లక్షల మెజారిటీతో బండి సంజయ్ పాత రికార్డులను చెరిపేసినట్లయింది.

**ప్రతి రౌండ్‌లోనూ ఆధిపత్యమే..**

ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 17,97,150 మంది ఓటర్లు ఉండగా, 13,02,447 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 24 రౌండ్లలో సుదీర్ఘంగా కౌంటింగ్ ప్రక్రియ జరిగింది. తొలి రౌండ్ మొదలు 24వ రౌండ్ వరకు బీజేపీ స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించింది. వెలిచాల రాజేందర్‌రావుకు 14వ రౌండ్‌లో కేవలం 70 ఓట్లతో ఆధిక్యత రాగా, కొద్దిసేపు కాంగ్రెస్ శిబిరంలో ఆశలు రేగాయి. మరుసటి రౌండ్ నుంచి పుంజుకున్న సంజయ్ ఎక్కడా తగ్గకుండా చివరివరకు తనదైన శైలిలో సంపూర్ణ ఆధిపత్యం చూపించారు. ఇక, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తోన్న హుస్నాబాద్‌లో కాంగ్రెస్ ఆధిక్యం చివరి వరకు కొనసాగింది. అలాగే, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ రెండోస్థానానికి పరిమితమైంది. మిగిలిన వేములవాడ (కాంగ్రెస్ ఎమ్మెల్యే), చొప్పదండి (కాంగ్రెస్ ఎమ్మెల్యే), కరీంనగర్ (బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే), మానకొండూర్ (కాంగ్రెస్ ఎమ్మెల్యే), హుజూరాబాద్ (బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే) అసెంబ్లీ సెగ్మెంట్లలో బీజేపీ దూకుడుగా ఓట్లు సాధించింది.

**పోస్టల్ బ్యాలెట్‌లోనూ బీజేపీ హవా..**

ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలైంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కించారు. బీజేపీ 6,289, కాంగ్రెస్ 2,461, బీఆర్‌ఎస్ 1,296 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు సాధించారు. 65 ఓట్లు నోటాకు వెళ్లగా.. 479 రిజెక్ట్ అయ్యాయి. పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో దాదాపు 5 శాతం తిరస్కరణకు గురవడం చర్చనీయాంశమైంది.

**రెండో స్థానంలో హస్తం.. పోటీ ఇవ్వని కారు**

7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో చూస్తే ఒక్క హుస్నాబాద్‌లోనే హస్తం పార్టీ మెజారిటీ సాధించింది. మిగిలిన 6 సెగ్మెంట్లలో బీజేపీ సత్తా చాటింది. రెండు సందర్భాల్లో మాత్రం బీజేపీ వెనకంజ వేసినట్లు కనిపించినా వెంటనే పుంజుకొని, తన మెజారిటీ కాపాడుకుంది. బీజేపీ 5,85,116 ఓట్లతో(44.57 శాతం) మొదటి స్థానంలో, కాంగ్రెస్ పార్టీ 3,59,907 ఓట్లతో(27.41 శాతం) రెండోస్థానంలో నిలిచాయి. ఇక, బీఆర్‌ఎస్ 2,82,163 ఓట్లతో (21.49 శాతం) మూడోస్థానానికి పరిమితమైంది. ఈ రెండు పార్టీలపై బీజేపీ సంపూర్ణంగా ఆధిపత్యం ప్రదర్శించింది. కారు పార్టీ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. కరీంనగర్ సెగ్మెంట్‌లో ఎక్కడా ప్రతిపక్షాలకు పైచేయి సాధించే వీలును బీజేపీ చిక్కనివ్వలేదు.

# చినుకుపడితే చిత్తడే

- కంపు కొడుతున్న డ్రెయినేజీలు
- తేలికపాటి వర్షానికే రోడ్లు జలమయం
- పట్టించుకోని పాలకులు, అధికారులు


పశువుల సంతలో నిలిచిపోయిన వరద నీరు


హరితనగర్ రోడ్డుపై నిలిచిపోయిన నీరు


సీఎస్ఐ రోడ్డుపై నిలిచిన నీరు

పరకాల: చినుకుపడితే చాలు పట్టణ రహదారులు జలమయం అవుతున్నాయి. డ్రెయినేజీలు ఆక్రమణ, ఏళ్లుగా మట్టిలో కూరుకపోయి అస్తవ్యస్తమైన డ్రెయినేజీలతో లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారులు, గల్లీలు సైతం వర్షపు నీరులో కనిపించుకుండా మునిగిపోతున్నాయి.అయినా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 22వార్డులలో ఏ వార్డుకు వెళ్లినా డ్రెయినేజీ సమస్యలే దర్శనమిస్తున్నాయి. సీసీ రోడ్ల నిర్మాణ పనుల మాదిరిగానే డ్రెయినేజీల నిర్మాణంపై పాలకులు, అధికారులు దృష్టి పెడితే ఇప్పటి వరకు సమస్య పరిష్కారమయ్యేదని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. గత ఐదు సంవత్సరాల్లో టీయూఎఫ్‌డీసీ రూ.25 కోట్ల అభివృద్ధి పనుల్లో డ్రెయినేజీ పనులు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వార్డు ప్రజలకు ముఖం చూపించలేకపోతున్నామని కొందరు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు అంటున్నారు. డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని గత ప్రభుత్వానికి విన్నవించుకున్నా నిధులు మంజూరు చేయలేదని వాపోతున్నారు. కనీసం మున్సిపల్ బడ్జెట్ ద్వారా చేపట్టాలని నిర్ణయించినా మున్సిపల్ సిబ్బంది వేతనాలు ఇచ్చేందుకు కూడా డబ్బులు సరిపోవడం లేదని చేతులు ఎత్తేశారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో ఇళ్లముందు వరద నీరు నిలుస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేలికపాటి వర్షానికి రోడ్లు జలమయం అవుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు, పాలకులు చర్యలు తీసుకుని డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు.

### ఇబ్బందులు పడుతున్నాం



వర్షకాలం వచ్చిందంటే చాలు ఇళ్ల ముందు, రోడ్లపై వరద నీరు నిలుస్తుంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే రాజిపేట నుంచి వెల్లంపల్లి రోడ్డు వరకు సైడ్ డ్రెయినేజీలు నిర్మించాలి. లేనిపక్షంలో కాలనీ వాసులమంతా మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టుతాం.

- ఏకు శంకర్, రాజిపేట కాలనీ, పరకాల

### డ్రెయినేజీలకు నిధులు కేటాయిస్తాం



మున్సిపాలిటీ పరిధిలో డ్రెయినేజీల పరిస్థితి అధ్వానంగా ఉన్న మాట వాస్తవమే. అందుకే వచ్చే సర్వసభ్య సమావేశంలో సైడ్ డ్రెయినేజీల నిర్మాణానికి వార్డుల వారీగా రూ.5లక్షల నిధులు కేటాయిస్తాం. డ్రెయినేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

- సోదా అనిత, మున్సిపల్ చైర్‌పర్సన్

# గుడిసెవాసులకు పట్టాలివ్వాలి


గుడిసెవాసులతో మాట్లాడుతున్న సాంబయ్య

నర్సంపేట : పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో గల సర్వే నంబర్ 111లోని ప్రభుత్వ భూమిని సర్వే చేసి గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాంబయ్య, రాష్ట్ర సెక్రటరీ ఎలిగేటి భాస్కర్ డిమాండ్ చేశారు. డీబీఆర్‌పీ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్న పేదలకు మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సాంబయ్య, భాస్కర్ మాట్లాడారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. పేదలకు ప్రభుత్వ భూములను పంచే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీబీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు, జిల్లా నాయకుడు రాపర్తి జగన్నాథం, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గణిపాక అశోక్, మండల ఇన్‌చార్జ్ కందగడ్డ సురేశ్, మహిళా సంఘం నాయకులు అల్లం రాజక్క, గండికోట సమ్మక్క, రజిత, సుజాత, అరుణ, మానస, కోమల తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ ఎంపీగా పర్వతగిరి బిడ్డ

- లోక్‌సభ ఎన్నికల్లో కడియం కావ్య ఘన విజయం
- మండల కేంద్రంలో సంబురాలు..


పర్వతగిరిలో బాణసంచా కాల్చి సంబురాలు జరుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కావ్య వరంగల్ ఎంపీగా ఘన విజయం సాధించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సమీప అభ్యర్థి (బీజేపీ) అరూరి రమేశ్‌పై రెండు లక్షలపై చిలుకు మెజార్టీతో గెలుపొందారు. దీంతో మండల కేంద్రంలో సంబురాలు అంబరాన్నంటాయి. కడియం శ్రీహరి తండ్రి పేరు లక్ష్మీనారాయణ. శ్రీహరి పర్వతగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్నత విద్యాభ్యాసం చేసి ఉన్నత చదువు కోసం హనుకొండలో స్థిరపడ్డాడు. కడియం శ్రీహరికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఇందులో కావ్య పెద్ద కూతురు. కావ్య.. తండ్రి శ్రీహరితో కలిసి హనుకొండలో నివాసం ఉంటుంది. కాగా, పలు రాజకీయ పార్టీల నాయకులు కడియం శ్రీహరి స్వగ్రామం పర్వతగిరి కాదని విమర్శించేవారు. అయితే కడియం శ్రీహరి.. పర్వతగిరిలో జరిగిన సమావేశంలో తాను పుట్టి పెరిగిన గడ్డ పర్వతగిరి అని ప్రతిపక్షాలకు ఘాటు సమాధానం చెప్పారు.

**రాజకీయ జన్మనిచ్చిన పర్వతగిరి..**

కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కడియం కావ్య, ఎర్రబెల్లి ప్రదీప్‌రావుకు పర్వతగిరి గడ్డ రాజకీయ జన్మనిచ్చింది. పర్వతగిరిలో పుట్టిన ఉన్నత స్థాయిలో ఉంటారని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

### టీడీపీ అభిమానుల సంబురాలు

కమలాపూర్ : ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తున్న సందర్భంగా ఆ పార్టీ, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అభిమానులు మంగళవారం రాత్రి మండల కేంద్రంలో సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ కూడలి వద్ద బాణాసంచా పేల్చి నినాదాలు చేశారు.

### నేడు ఉచిత వైద్యశిబిరం

హన్మకొండ చౌరస్తా : డయాబెటిక్, గుండె సంబంధిత వ్యాధులపై హనుమకొండ చౌరస్తా సమీపంలోని పద్మాక్షి పాలిక్లినిక్ లో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. శిబిరంలో ప్రముఖ ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ ఇ.లక్ష్మణ్‌కుమార్, డయాబెటిక్, థైరాయిడ్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీవీ అనిల్‌కుమార్ వైద్యపరీక్షలు చేస్తారని తెలిపారు. 99559 96166, 91338 93360 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మామునూరు : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని వరంగల్ సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్ కుమార్, సీఐ రవికుమార్ సూచించారు. ఖిలా వరంగల్ మండలం మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో ఎన్‌సీసీ 8వ బాలికల బెటాలియన్ వరంగల్ ఆధ్వర్యంలో ఈనెల 1 ప్రారంభమైన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం మంగళవారం నాలుగో రోజుకు చేరుకోగా ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. సైబర్ నేరాలతో సమాజంలో అనేక అవకతవకలు పాల్పడి ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్న విధానం, సాంకేతికతను తప్పుగా వాడి సమాజాన్ని భయభ్రాంతులను గురి చేస్తున్నాయని వివరించారు. సైబర్ నేరాలపై ఏమైనా అనుకోని ఘటనలు ఎదురైతే సైబర్ పోలీసులను వెంటనే సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ రవికుమార్, డిప్యూటీ కమాండెంట్ రేవతి ప్రభాకర్, లెఫ్టినెంట్ స్వప్న, రమణా, శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, సిబ్బంది, కేడెట్లు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



నెక్కొండ: ఉపాధ్యాయుల ప్రోత్సాహం, విద్యార్థుల్లో పట్టుదల ఉంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులు సైతం జాతీయ స్థాయిలో రాణిస్తారని నెక్కొండ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగారావు అన్నారు. పాఠశాలలో పదో తరగతి చదివిన భట్టు నిఖిల్‌వర్మ రేపు (బుధవారం) మద్రాసు ఐఐటీలో జరిగే స్టాక్ హోమ్ జూనియర్ వాటర్ ప్రైజ్ ఇండియా (ఎస్‌జేడబ్ల్యూపీ) ఫైనల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా భట్టు నిఖిల్‌వర్మను మంగళవారం పాఠశాలలో అభినందించారు. ఈ పోటీల్లో విజయం సాధిస్తే ఆగస్టు 24నుంచి 29వరకు స్టాక్ హోమ్ పోటీల్లో భారత్ తరపున పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్ పూస కిశోర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

### నాగేంద్రస్వామికి లక్ష పుష్పార్చన



గీసుకొండ: మండలంలోని ఊకల్‌హవేలి గ్రామంలోని ప్రసిద్ధ నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారికి మల్లె పూలతో లక్ష పుష్పార్చన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

### చికిత్స పొందుతున్న వివాహిత మృతి

గీసుకొండ : మండలంలోని జాన్‌పీరీలు (ఆదర్శనగర్)కు చెందిన వివాహిత ఎనుక తులసి (24) వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. ఎనుక తులసి, రవిని ప్రేమించి వివాహం చేసుకుంది. వారికి ఇద్దరు ఆడపిల్లలు కలిగారు. రవి ప్రతిరోజూ ఆలస్యంగా ఇంటికి వస్తుండడంతో కొద్ది రోజులుగా దంపతుల నడుమ తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో రవి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి బయటకు వెళ్లగా ఈనెల 31న తులసి ఇంట్లోనే ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. బంధువులు, స్థానికులు ఆమెను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి రాగి మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్‌కుమార్ తెలిపారు.

**విద్యుదాఘాతానికి గురై పాడి గేదె..**



చెన్నారావుపేట : విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని జల్లి శివారులో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మంద రమేశ్ సాకుతున్న పాడి గేదె గ్రామ శివారులోని బంధం కుంట ప్రాంతంలో మేత మేస్తుండగా ఇటీవల వీచిన గాలిదుమారానికి తెగిపడిన విద్యుత్ సరఫరా అవుతున్న తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధితుడు రమేశ్ వాపోయాడు. మృతి చెందిన పాడి గేదెను డాక్టర్ మంజీలాల్, విద్యుత్ అధికారులు పరిశీలించారు.

### బీజేపీ నాయకుల హర్షం



దుగ్గొండి : కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడంతో బీజేపీ కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని గిర్నిబావిలో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో నాయకులు బుసాని రమేశ్, ఏరుకొండ కరుణాకర్, అన్న లింగన్న, రాజేందర్, రమేశ్, కుమారస్వామి, కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

### సంబురాలు

నర్సంపేట : ఏపీలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ విజయం సాధించగా పట్టణంలోని వరంగల్ రోడ్డు జంక్షన్‌లో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు శివకోటి ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో నాయకులు వంగ మధు, ఓర్సు రాజేందర్, బొబ్బ పృథ్వీరాజ్, రొడ్డ శ్రీకాంత్, షేక్ హుస్సేన్, మిలాన్, గంగుల రంజిత్, డేవిడ్, నాగరాజు, పోషాల కార్తీక్, రాపోలు సురేశ్, శ్యామ్, నవజీవన్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబురాలు


శాయంపేట : బాణసంచా పేల్చుతున్న శ్రేణులు


ఐనవోలు : సంబురాలు చేసుకుంటున్న నాయకులు

శాయంపేట : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య భారీ మెజార్టీతో గెలుపొందడంతో మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

**ఐనవోలులో..**

ఐనవోలు : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య సమీప బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌పై 2,19,691 ఓట్ల భారీ మెజార్టీతో పెందడంతో మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద మంగళవారం ఆ పార్టీ శ్రేణులు బాణసంచా పేల్చి సంబురాలు చేసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ శ్రేణులు విజయోత్సవ వేడుకలు


ఎల్కతుర్తి : బాణసంచా పేల్చుతున్న నాయకులు


ముల్కనూరులో..


కమలాపూర్ : బాణసంచా పేల్చుతున్న బీజేపీ శ్రేణులు

ఎల్కతుర్తి : పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా బండి సంజయ్ అత్యధిక మెజారిటీతో గెలుపొందడంపై ఆ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, ఎల్కతుర్తి మండల కేంద్రంలో గల బస్టాండ్ సమీపం వద్ద బాణసంచా కాల్చి నినాదాలు చేశారు. అనంతరం ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిరంజీవి, పృథ్వీరాజ్, కిష్టయ్య, వెంకటేష్, శంకరయ్య, మధుసుధన్, దేవేందర్‌రెడ్డి, అశోక్, మాజీ సర్పంచ్‌లు నిరంజన్ రెడ్డి, సురేష్‌రెడ్డి, రామారావు, వెంకటేష్, కొమురయ్య, రాజు, కుమారస్వామి, కిషన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

**కమలాపూర్‌లో..**

కమలాపూర్ : కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్, మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ భారీ మెజార్టీలతో గెలుపొందడంతో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. మంగళవారం రాత్రి స్థానిక బస్టాండ్ కూడలితో పాటు మండలంలోని వివిధ గ్రామాలు, గుడిబండ వద్ద బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మల్లన్న ఆలయంలో మాసశివరాత్రి వేడుకలు


పూర్ణాహుతిలో పాల్గొన్న ఈఓ, అర్చకులు


పట్నం వేసి పూజలు చేస్తున్న ఒగ్గు పూజారులు

ఐనవోలు : ప్రఖ్యాత ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ మేరకు మంగళవారం ఉదయం నిత్యపూజల అనంతరం అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపించారు. ఒగ్గు పూజారులు స్వామివారికి ఎదురుగా నజరు పట్నం వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు మధుకర్‌శర్మ, వేద పండితుడు గట్టు పురుషోత్తమశర్మ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రమాదాలు జరుగుతున్నా..


ప్రమాదకరంగా ఉన్న కమలాపురం క్రాస్ రోడ్డు..

కమలాపురం క్రాస్‌లో దుస్థితి

- స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచికలూ కరువే
- పోలీస్, ఎన్‌హెచ్ శాఖల నిర్లక్ష్యం

నర్సంపేట రూరల్ : నర్సంపేట పట్టణ శివారులోని కమలాలపురం క్రాస్ రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..? అనే వ్యాఖ్యలు వినపడుతున్నాయి. కమలాపురం క్రాస్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ప్రమాదాల నివారణ కోసం స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచికలూ ఏర్పాటు చేసిన దాఖలాల్లేవు. పోలీస్, ఎన్‌హెచ్ శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే అపవాదు ఉంది. నర్సంపేట పట్టణ శివారులోని కమలాపురం క్రాస్ రోడ్డు 365వ నంబర్ జాతీయ రహదారిపై ఎలాంటి మలుపు లేకుండా ఉంది. ఈ క్రమంలో వాహనాలు అధిక వేగంతో రావడం పరిపాటిగా మారింది. అయితే కమలాపురం క్రాస్ రోడ్డుకు రాగానే వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. కమలాపురం క్రాస్ రోడ్డు సమీపంలోనే వైన్ షాపు సైతం ఉంది. పలువురు మందు బాబులు వైన్ షాపు వద్ద మద్యం సేవించి బయల్దేరుతుండడంతో సైతం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కమలాపురం గ్రామం నుంచి జాతీయ రహదారిపై ఒక్కసారిగా వాహనాలు భారీ సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలోనూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. కొన్ని నెలల క్రితం వరంగల్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న వాహనం కమలాపురం క్రాస్ రోడ్డు వద్దే స్కూల్ పిల్లల వాహనాన్ని ఢీకొట్టింది. అనంతరం అనేక ప్రమాదాలూ చోటు చేసుకున్నాయి. ఎన్‌హెచ్, పోలీసు శాఖ అధికారులు పట్టించుకోవడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.